# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల పర్యటనలో భాగంగా రేపు హర్యానా, చండీగఢ్, పంజాబ్ లలో పర్యటించనున్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో విభాగంగా ఈనెల 11వ తేదీన మారిషస్ కు వెళ్లనున్నారు.
- ❖ దేశంలో ప్రజారోగ్య సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని కేంద్రమంత్రి జే పి నడ్డా పునరుద్ఘాటించారు.
- ❖ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ విడత రేపు ప్రారంభం కానుంది.
- ❖ ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బాగంగా ఈరోజు దుబాయ్ వేదికగా భారత్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది.

============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల పర్యటనలో భాగంగా రేపు హర్యానా, చండీగఢ్, పంజాబ్ లకు వెళ్ళనున్నారు. తొలి రోజు రాష్ట్రపతి గురు జంభేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం రాష్ట్రస్థాయిలో బ్రహ్మకుమారి సంస్థ నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత రోజు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్, ఎయిమ్స్ స్నాతకోత్సవాలలో పాల్గొని 12వ తేదీన చండీగడ్ లోని పంజాబ్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరుకానున్నారు.

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో విభాగంగా ఈనెల 11వ తేదీన మారిషస్ కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే మారిషస్ జాతీయ దినోత్సవాలకు ప్రధానమంత్రి ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. మారిషస్ లోని

గంగా తలాబ్ సమీపంలో ఉన్న మోరిసేస్వర శివాలయం పర్యవేక్షకులు సతీష్ దయాల్ ఆకాశవాణి వార్త విభాగంతో మాట్లాడుతూ... ప్రపంచ వ్యవహారాలలో నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల మారిషస్ లోని భారత సంతతి ప్రజలు గర్వపడుతున్నారని అన్నారు. కరోనా సమయంలో అభివృద్ధి ప్రాజెక్టులలో మారిషస్ కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం అందించారని అన్నారు.

============================

న్యూఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉపరాష్ట్రపతి సతీమణి సుధేష్ ధన్‌ఖడ్‌తో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం మెరుగ అవుతోందని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సామాజిక మాధ్యంలో ఈ మేరకు రాష్ట్రపతి పేర్కొన్నారు. కాగా ఎయిమ్స్‌లో ఉపరాష్ట్రపతిని ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపరాష్ట్రపతి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధానమంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కాగా అనారోగ్య సమస్యతో నిన్న అర్ధరాత్రి ఉపరాష్ట్రపతి ఎయిమ్స్‌లో చేరారు.

============================

కృత్రిమ మేధ (ఏఐ) మహిళలకు ఎంతో ఉపయోగకరంగా నిలవడంతో పాటు నూతన అవకాశాలను సృష్టించడంలో సహాయపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. మహిళా సాధికారతలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రపై మహిళ శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ రాసిన కథనాన్ని సామాజిక మాధ్యమంలో ప్రధానమంత్రి పంచుకున్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే సంకల్పంతో బలమైన, స్వావలంబన కలిగిన దేశంగా మార్చడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని, దీనిలో మహిళల సమాన భాగస్వామ్యం కీలకమని సామాజిక మాధ్యమంలో కేంద్ర సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ పేర్కొన్నారు. సమాజంలో నిర్ణయాత్మక పాత్ర పోషించే విధంగా ఏఐ నిలుస్తుందని ఆమె ఈ కథనంలో తెలిపారు.

============================

ప్రజల్లో పఠనాసక్తిని ప్రోత్సహించేందుకు గుజరాత్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈ రోజు గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో శస్తు సాహిత్య ముద్రణాలయ ద్వారా పునర్ ముద్రణ చేసిన 24 పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... గోవర్ధన్ రామ్ త్రిపాఠి, హేమచంద్రాచార్య నర్మద్, సరసింహ్‌మెహతా వంటి ప్రముఖులు గుజరాతీ భాషను సుసంపన్నం చేశారని అన్నారు. అలాగే జైన ఆచార్య శ్రీమద్ బుద్ధిసాగర్ సురీశ్వర్ జీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని స్మారక నాణాన్ని విడుదల చేశారు.

============================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ విడత రేపు ప్రారంభం కానుంది. ఈ సమావేశాలు ఏప్రిల్ నాలుగవ తేదీ వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్ రాష్ట్ర బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ రేపు ప్రవేశపెట్టనున్నారు. గత నెలలో ముఖ్యమంత్రి బిరెన్ సింగ్ రాజీనామా చేసినప్పటి నుంచి ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. ఈ బడ్జెట్ సమావేశాలలో ఆర్థిక వ్యవహారాలతో పాటు బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇమిగ్రేషన్ - విదేశీయుల బిల్లు, రైల్వే సవరణ బిల్లుతో సహా అనేక బిల్లులపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు.

విరామం

============================

దేశంలో అందరికీ ఆరోగ్యాన్ని అందించడం, ప్రజారోగ్య సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జే పి నడ్డా పునరుద్ఘాటించారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంస్థ 48వ వార్షిక వేడుకల్లో ఆయన దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.... దేశంలో ప్రజారోగ్య నిపుణులకు శిక్షణ, పరిశోధన, సామర్థ్యాల పెంపునకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణలో ఎన్.ఐ.హెచ్.ఎఫ్.డబ్ల్యూ. ముందంజలో ఉందని తెలిపారు.

నేషనల్ కోల్డ్ చైన్ అండ్ వ్యాక్సిన్ మేనేజ్ మెంట్ & రిసోర్స్ సెంటర్ (ఎన్‌సీసీ వీఎంఆర్‌సీ) ప్రాముఖ్యతను వివరిస్తూ... ఈ కేంద్రాన్ని అంతర్జాతీయంగా అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇమ్యునైజేషన్, సప్లై చైన్ రంగంలో భారతీయ నాయకత్వానికి ఈ కేంద్రం నిదర్శంగా నిలుస్తుందని అన్నారు.

భారతదేశం ప్రజారోగ్యంలో కొత్త యుగంలోకి ప్రవేశించిందని, ప్రభుత్వం సార్వత్రిక ఆరోగ్య భద్రతను అందించే దిశగా దృష్టి సారిస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. వైద్య విద్యార్థుల సామర్థ్యాలను పెంచాల్సిన అవసరాన్ని, డిజిటల్ విద్య ప్రాముఖ్యతను అనుప్రియ పటేల్ వివరించారు.

===========================

కాలిఫోర్నియాలోని చినోహిల్స్ లో భారతీయ దేవాలయంలో జరిగిన దాడిని భారతదేశం ఖండించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులు దీనిపై స్పందించాలని అన్నారు. ప్రార్థన స్థలాలలో తగిన భద్రతను కల్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

===========================

ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమిట్ (వేవ్స్) కి 1,290 మంది తమ ప్రతిపాదనలను పంపారు. వీరిలో 19 మంది విదేశీయులు కూడా ఉన్నారు. ఈ పోటీలకు సంబంధించిన తుది ఫలితాలను వచ్చే నెలలో ప్రకటిస్తారు. ఔత్సాహితులతో పాటు నిపుణులు కూడా తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ఇది నిలుస్తోంది. దీనిలో పాల్గొనేవారు నిపుణుల మార్గదర్శకత్వం, అత్యుత్తమ బోధనా తరగతుల నుంచి విస్తృత జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కలుగుతుంది.

===========================

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బాగంగా ఈరోజు దుబాయ్ వేదికగా భారత్ న్యూజ్ లాండ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు భారత్ కు 252 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ కడపటి వార్తలు అందే సమయానికి 29 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది.

===========================

మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఈరోజు దేశ రాజధాని న్యూఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాతో కలిసి మహిళల బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఢిల్లీలోని విభిన్న ప్రాంతాల నుంచి మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేఖా గుప్తా మాట్లాడుతూ... మహిళల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతూ.. వారిని ప్రోత్సహించే విధంగా ఈ ర్యాలీ నిలుస్తుందని అన్నారు.

===========================

కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గోవింద్ మోహన్ తొలిసారిగా భద్రతపై జమ్మూలో జరుగుతున్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన ఈరోజు కాశ్మీర్ ను సందర్శించారు. రెండు సెషన్లుగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జమ్మూ కాశ్మీర్ నుంచి సీనియర్ పోలీసులు, భద్రతా అధికారులు హాజరుకానున్నారు. ఉగ్రవాద నిర్మూలనకు అవసరమైన వ్యూహాలు రూపొందించడం, ఇతర భద్రతా పరమైన అంశాలపై చర్చిస్తారు. పారామిలటరీ దళాలు, నిఘా సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

==============================

==============================